
JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి I సోమవారం 13-07-2026
Medchal - Malkajgiri I Monday 13-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 I సంచిక : 42
పేజీలు : 8 I వెల : 5
Vol. 03 I Issue 42 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com

# డెంగీ పంజా



**హైదరాబాద్‌లో మారుతున్న వాతావరణం, దోమల ఉత్పత్తి వల్ల డెంగ్యూ ఏడాదంతా ముప్పుగా మారుతోందని ఆరోగ్య శాఖ హెచ్చరించింది. ఈడిస్ ఈజిప్టి దోమలు ఇళ్లలోని కూలర్లు, ఏసీ పైపులు, పూలకుండీల స్వచ్ఛమైన నీటిలో ఎక్కువగా పెరుగుతున్నాయని నిపుణులు తెలిపారు. 80 శాతం కేసుల్లో లక్షణాలు లేకపోవడం వల్ల వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఈ దోమలు పగటిపూట కుట్టడం వల్ల స్కూళ్లు, ఆఫీసుల్లో ముప్పు ఎక్కువని పేర్కొన్నారు. ప్రతి వారం ఇళ్లను శుభ్రం చేసుకోవడం ద్వారా దోమల నిర్మూలనకు సహకరించాలని ప్రజారోగ్య డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ కోరారు.**

- **హైదరాబాద్‌లో డెంగీ పంజా**
- **ఏడాదంతా పొంచి ఉన్న ముప్పు**
- **హెచ్చరించిన ఆరోగ్య శాఖ**

**హైదరాబాద్ :**

రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభం కావడంతో హైదరాబాద్ మహానగరంలో డెంగీ సీజన్ కలకలం రేపుతోంది. మారుతున్న దోమల సంతానోత్పత్తి సరళి, అస్తవ్యస్తమైన రుతుపవన పరిస్థితుల కారణంగా ఇప్పుడు డెంగీ కేవలం ఒక నిర్దేశిత సీజన్‌కే పరిమితం కాకుండా.. ఏడాదంతా వేధించే ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మారుతోందని ఆరోగ్య శాఖ అధికారులు నగరవాసులను హెచ్చరించారు. నగరంలో కొన్ని రోజులు భారీ వర్షాలు, మరికొన్ని రోజులు పొడి వాతావరణం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఇది 'ఈడిస్ ఈజిప్టి దోమలు స్వచ్ఛమైన నిల్వ నీటిలో గుడ్లు పెట్టడానికి అత్యంత అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తోందని అధికారులు తెలిపారు. సాధారణంగా నిరంతరాయంగా కురిసే భారీ వర్షాల వల్ల దోమల లార్వాలు కొట్టుకుపోతాయని, కానీ విడతల వారీగా కురిసే తేలికపాటి జల్లుల వల్ల నివాస ప్రాంతాల్లో అనేక చోట్ల నీరు నిలిచిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయని విశ్లేషించారు.
దాదాపు 80 శాతం డెంగ్యూ ఇన్‌ఫెక్షన్లు ఎలాంటి లక్షణాలు లేని కేసులుగా నమోదవుతున్నాయి. దీని వల్ల సోకిన వ్యక్తులు తమకు డెంగీ ఉందనే విషయం తెలియకుండానే వైరస్ వ్యాప్తికి కారకులవుతున్నారు. ఈ వైరస్ సోకిన వ్యక్తులను కుట్టిన దోమలు, ఆ తర్వాత ఆరోగ్యంగా ఉన్న ఇతరులను కుట్టడం ద్వారా వేగంగా ఇన్‌ఫెక్షన్ వ్యాపింపజేస్తున్నాయి. గతంతో పోలిస్తే ఈడిస్ ఈజిప్టి దోమలు పట్టణ వాతావరణానికి ఎక్కువగా అలవాటు పడ్డాయని, ప్రస్తుతం ఇవి బహిరంగ ప్రదేశాల కంటే ఇళ్ల లోపలే ఎక్కువగా సంతానోత్పత్తి సాగిస్తున్నాయని ఆరోగ్య అధికారులు గుర్తించారు. నివాస గృహాలలోని రిఫ్రిజిరేటర్ డ్రిప్ ట్రేలు, ఎయిర్ కూలర్ ట్యాంకులు, పూల కుండీలు, ఓవర్‌హెడ్ వాటర్ స్టోరేజ్ కంటైనర్లు, ఏసీ కండెన్సేట్ పైపులు వంటి వాటిలో చేరే స్వచ్ఛమైన నీరు వీటికి ప్రధాన నిలయాలుగా మారుతున్నాయి. ఈ దోమలు ప్రధానంగా పగటిపూట మాత్రమే కుడుతుండటం వల్ల పాఠశాలలు, కార్యాలయాలు, ఇతర బహిరంగ ప్రదేశాలలో డెంగ్యూ వ్యాప్తి చెందే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంది. ఇళ్లలో, పరిసరాల్లో స్వల్ప పరిమాణంలో నిలిచే స్వచ్ఛమైన నీటిని కూడా నిర్లక్ష్యం చేయవద్దని వైద్యారోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రజలు ప్రతి వారం తమ ఇళ్లను స్వయంగా తనిఖీ చేసుకోవాలని, నీటి కంటైనర్లను ఖాళీ చేసి వాటిని బాగా రుద్ది కడగాలని, దోమలు గుడ్లు పెట్టే అవకాశం లేకుండా నిల్వ నీటిని తొలగించాలని సూచించారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించడం ద్వారా సకాలంలో వ్యాధిని గుర్తించి ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. రుతుపవనాల సమయంలో డెంగ్యూ వ్యాప్తిని అరికట్టడానికి ఇళ్లల్లోనే దోమల ఉత్పత్తి కేంద్రాలను నిర్మూలించటమే ప్రభావవంతమైన మార్గమని అధికారులు స్పష్టం చేశారు.



# మా నెత్తురు ఇస్తాం.. రైతులకు నీళ్లు ఇవ్వండి

- **అరవై ఏళ్ల రక్తదాహం ఇంకా తీరలేదా?**
- **"నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా అంటావా.. రక్తపిశాచీ!" అంటూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో కేటీఆర్ విమర్శలు గుప్పించారు**

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో సాగునీటి విడుదల, ఎండిపోతున్న పంటల చుట్టూ రాజకీయాలు తీవ్రస్థాయికి చేరాయి. నీటి విడుదల కోసం రైతులు, ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్లపై అధికార కాంగ్రెస్ పార్టీ స్పందిస్తున్న తీరును తప్పుబడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. "నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా అంటావా.. రక్తపిశాచీ!" అంటూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను, గత ఘటనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు.

**అరవై ఏళ్ల రక్తదాహం ఇంకా తీరలేదా?**

తెలంగాణను దాదాపు 60 ఏళ్ల పాటు పీడించి, ఇక్కడి ప్రజల నెత్తురు తాగిన కాంగ్రెస్ పార్టీ రక్తదాహం ఇంకా తీరలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ రక్తం రుచిమరిగిన తోడేలులా కాంగ్రెస్ ప్రవర్తిస్తోందని, ఈ ప్రాంతానికి ఇంకెంత రక్తం కావాలని ప్రశ్నించారు. గతంలో ఎన్‌కౌంటర్ల పేరుతో తెలంగాణ పిల్లలను పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేసి, నెత్తుటేళ్లు పారించిన నరహంతక చరిత్ర కాంగ్రెస్‌దని కేటీఆర్ ఆరోపించారు.

**చారిత్రక ఘటనల ప్రస్తావన**


1952 నాటి ముల్కీ ఉద్యమంలో ఏడుగురు అమాయక యువకులను కాల్చిచంపి రక్తం కళ్లజూసిన రాక్షస చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కేటీఆర్ మండిపడ్డారు. 1969 ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో 369 మంది తెలంగాణ ముద్దుబిడ్డలపై తూటాలు కురిపించి రక్తం పారించిన ఖూనీకోర్లు కాంగ్రెస్ నాయకులున్నారు. ఇక మలిదశ తెలంగాణ ఉద్యమంలో వేలాది మంది యువకుల బలిదానాలకు కారణమైన మృగాలు కాంగ్రెస్ పాలకులే అని ఆరోపించారు. "కాంగ్రెస్ పార్టీ చేతులు తెలంగాణ బిడ్డల రక్తంతో తడిశాయి.. ఆ రక్కసి కోరలకు తెలంగాణ నెత్తుటి మరకలు అంటుకున్నాయి" అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

**నెత్తురు మాది.. నీళ్లు మా రైతాంగానికి!**

"నెత్తురు ఇస్తేనే నీళ్లు ఇస్తాం అని రేవంత్ కోరుతుంటే, మా నెత్తురు ధారపోయడానికి కూడా మేము సిద్ధం" అని కేటీఆర్ సవాల్ విసిరారు. రాష్ట్రం కోసం, నీళ్ల కోసం పేగులు తెగేదాకా కొట్లాడిన చరిత్ర తమదని, రైతుల కోసం ఎంత రక్తమైనా ఇస్తామని స్పష్టం చేశారు. నీళ్లలో నిప్పులు పుట్టించి జలసాధన పోరాటాలు చేసిన తాము, ప్రభుత్వ బెదిరింపులకు లొంగబోమని తేల్చిచెప్పారు. "నీకు మా రక్తం ఎంత కావాలంటే అంత పంపిస్తాం.. మా రక్తం తాగి మీ రక్తదాహం తీర్చుకోండి, కానీ ఎండిపోతున్న మా పొలాల జలదాహం తీర్చి, రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయండి" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# భవిష్యత్ ప్రగతికి ఊతం

- **ప్రధాని నరేంద్ర మోదీ వ్యూహాత్మక ఎత్తుగడ**
- **ఇండోనేషియాతో చరిత్రాత్మక రక్షణ ఒప్పందాలు**
- **అమెరికా, చైనాకి చెక్!**


2 లో

**జయభేరి, న్యూఢిల్లీ :**

ఇండోపసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రాబల్యం వేగంగా పెరుగుతున్న తరుణంలో, అమెరికా విధానాలలో అనిశ్చితి నెలకొన్న కారణంగా.., భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల చేపట్టిన మూడు దేశాల (ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్) పర్యటన అత్యంత వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. క్షిపణులు, యురేనియం పంపిణీ, కీలక ఖనిజాలు, క్రీడా దౌత్యం వంటి కీలక రంగాలలో భాగస్వామ్యాలను పెంపొందించుకోవడానికి మోదీ ఈ పర్యటనను వేదికగా మలుచుకున్నారని బ్లూమ్‌బెర్గ్ రిపోర్ట్ చేసింది.

**ఇండోనేషియాతో చరిత్రాత్మక రక్షణ ఒప్పందాలు:**

ప్రధాని మోదీ పర్యటనలో భాగంగా ఇండోనేషియాతో రక్షణ, వ్యూహాత్మక ఒప్పందాలు కుదిరాయి. ఇందులో అత్యంత ముఖ్యమైనది సుమారు రూ.5,400 కోట్ల విలువైన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణుల కొనుగోలు ఒప్పందం. భారత్ నుంచి ఇప్పటివరకూ ఇదే గరిష్ఠ రక్షణ ఎగుమతి డీల్. ఫిలిప్పీన్, వియత్నాం తర్వాత భారత్ నుండి ఈ క్షిపణులను కొంటున్న మూడో దేశంగా ఇండోనేషియా నిలిచింది.


2 లో

# కేంద్ర ఎన్నికల సంఘానికి కల్వకుంట్ల కవిత కీలక లేఖ

- **మాపై వచ్చిన ఆ 1,000 అభ్యంతరాల కాపీలు ఇవ్వండి!**
- **పేరు మార్చమంటే తీవ్ర నష్టం**
- **దేశంలో ఒకే పేరుతో వందలాది పార్టీలు లేవా?**

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రక్షణ సేన పార్టీ రిజిస్ట్రేషన్‌ను తక్షణమే ఆమోదించి, గుర్తింపు ఇవ్వాలని పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి సుదీర్ఘ లేఖ ద్వారా రిప్లయ్ ఇచ్చారు.

# ప్రభుత్వ రేటు ఇదే, అమ్మో అన్ని కోట్లా?


2 లో

- **అమరావతిలో రైతులకు పరిహారం చెల్లింపు**
- **ఉండవల్లి రైతుల నుంచి భూసేకరణ చేశారు**
- **వారి డబ్బుల్ని కోర్టులో జమ చేసిన సర్కార్**

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఎకరా భూమి ధర ఎంత?. తాజాగా ఏపీ ప్రభుత్వం సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మానానికి సంబంధించి రైతులకు చెల్లించిన పరిహారంతో ఆసక్తికర విషయాలు తెలిశాయి. అమరావతికి సీడ్ యాక్సెస్ రోడ్డు చాలా కీలకంగా మారింది.. కొంతకాలంగా భూసేకరణకు సంబంధించి కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయి. తాజాగా ఉండవల్లిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి ఉన్న ఒక్క అడ్డంకి తొలగిపోయింది.

మొదటిపేజీ తరువాయి

## భవిష్యత్ ప్రగతికి ఊతం

దీనితో పాటుగా భారతీయ సాంకేతికతతో తయారైన 'అస్త్ర' ఎయిర్‌టుఎయిర్ క్షిపణులను కూడా కొనేందుకు ఇండోనేషియా అంగీకరించింది. రక్షణ రంగంతో పాటు వ్యూహాత్మకంగా మలాకా జలసంధికి సమీపంలో ఉన్న 'సబాంగ్ పోర్టు'ను భారత్‌ఇండోనేషియాలు సంయుక్తంగా అభివృద్ధి చేయనున్నాయి. ఇది ప్రాంతీయ భద్రతకు ఎంతగానో దోహదపడుతుంది.

**ఆస్ట్రేలియాతో యురేనియం, కీలక ఖనిజాల ఒప్పందాలు:**
మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్‌తో జరిగిన ద్వైపాక్షిక చర్చలు విశేష ఫలితాలను సాధించాయి. భారతదేశ పౌర అణు ఇంధన కార్యక్రమానికి ఆస్ట్రేలియా యురేనియం ఎగుమతి చేయడానికి కీలక ఒప్పందం కుదిరింది. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనే భారత ప్రభుత్వ లక్ష్యానికి ఈ ఒప్పందం బలమైన పునాది వేస్తుంది అలాగే రెండు దేశాలూ కొత్తగా 'జాయింట్ డిక్లరేషన్ ఆన్ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ కోఆపరేషన్'ను కూడా ఆమోదించాయి. గ్రీన్ హైడ్రోజన్, కీలక ఖనిజాల సరఫరా కోసం చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ఆస్ట్రేలియాతో భారత్ బలమైన ఆర్థిక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకుంది.

**చైనాకు చెక్, ప్రాంతీయ భద్రత:**
ప్రధాని మోదీ ఇండోనేషియాలో అడుగుపెట్టడానికి ఒకరోజు ముందే పసిఫిక్ మహాసముద్రంలో చైనా.. అణు సామర్థ్యం గల ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ క్షిపణి (ICBM)ని జలాంతర్గామి నుంచి ప్రయోగించింది. ఈ చర్య ప్రాంతీయ దేశాల్లో తీవ్ర ఆందోళనలను రేకెత్తించింది. ఈ పరిణామాల మధ్య భారత్, ఆస్ట్రేలియా, ఇండోనేషియాలు తమ రక్షణ, సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేసుకోవడం చైనా విస్తరణవాదానికి బలమైన కౌంటర్ అనుకోవచ్చు. ఈ ప్రాంతంలో భాగస్వామ్యాలు కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా 'పరస్పర విశ్వాసం' ఆధారంగా నిర్మితమవ్వాలని ప్రధాని మోదీ తన పర్యటనలో స్పష్టం చేశారు.

**భవిష్యత్ ప్రగతికి ఊతం:**
ఎలక్ట్రిక్ వాహనాలు (EVs), పునరుత్పాదక ఇంధన రంగాలలో.... నికెల్ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న ఇండోనేషియా , అరుదైన ఖనిజాల్ని కలిగివున్న ఆస్ట్రేలియా దేశాలతో కుదిరిన ఒప్పందాలు భవిష్యత్తులో భారతదేశ ఆర్థిక ప్రగతికి ఊతం ఇవ్వనున్నాయి. అలాగే మౌలిక సదుపాయాల రంగంలో ఇండోనేషియా సుమారు 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. క్రికెట్ వంటి క్రీడా దౌత్యం ద్వారా ఆస్ట్రేలియాతో సాంస్కృతిక సంబంధాలను మోదీ మరింత బలోపేతం చేశారు. చైనా ముడిసరుకు మీద ఆధారపడటాన్ని తగ్గించి, భారతదేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దాలనే 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యానికి ఈ పర్యటన విశేషమైన ఊపునిచ్చింది.

## కేంద్ర ఎన్నికల సంఘానికి కల్వకుంట్ల కవిత కీలక లేఖ

దేశంలో ఒకే రకమైన పేర్లతో వందలాది పార్టీలు ఉన్నప్పుడు.. తమ పార్టీ విషయంలోనే అభ్యంతరాలు వ్యక్తం చేయడం సరికాదన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 లోని సెక్షన్ 29A కింద ప్రతిపాదిత తెలంగాణ రక్షణ సేన పార్టీ గుర్తింపు దరఖాస్తును ఆమోదించి, నిష్పాక్షికమైన ఉత్తర్వులు జారీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని విజ్ఞప్తి చేశారు.

**మాపై వచ్చిన ఆ 1,000 అభ్యంతరాల కాపీలు ఇవ్వండి!**
తమ పార్టీ రిజిస్ట్రేషన్‌పై సుమారు వెయ్యి అభ్యంతరాలు వచ్చాయని జూన్ 23న ఎన్నికల సంఘం లేఖ రాసిందని, అయితే వాటిలో ఒక్క కాపీని కూడా ఇంతవరకు తమకు పంపలేదని ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ పేర్కొన్నారు. అసలు అభ్యంతరాలు ఎవరు వ్యక్తం చేశారు? అందులో ఏముందో మాకు తెలియకుండా మేము సమాధానం ఎలా చెప్పగలం? తెలంగాణలో మూడున్నర కోట్ల జనాభా ఉంటే కేవలం 1,000 అభ్యంతరాలను చూపించి రిజిస్ట్రేషన్ ఆపడం హేతుబద్ధం కాదన్నారు.. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈసీ ముందు వ్యక్తిగత విచారణకు హాజరయ్యే ముందే మాకు ఆ అభ్యంతరాల కాపీలన్నీ అందజేయాలని లేఖలో డిమాండ్ చేశారు.

**పేరు మార్చమంటే తీవ్ర నష్టం**
ఈ ఏడాది ఏప్రిల్ 28న కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రక్షణ సేన అనే పేరును కేటాయిస్తూ తమకు అధికారికంగా లేఖ ఇచ్చిందని గుర్తు చేశారు. ఈసీ ఆమోదాన్ని నమ్ముకుని ఇప్పటికే తెలంగాణవ్యాప్తంగా 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి, సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఇప్పుడు అకస్మాత్తుగా పేరు మార్చుకోవాలని చెబితే పార్టీకి తీవ్ర నష్టం, అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల పేర్ల పోలికలను నిర్ధారించేటప్పుడు పూర్తి పేరును సమగ్ర రూపంగా చూడాలి తప్ప.. అందులోని విడి పదాలను ముక్కలు చేసి చూడకూడదని ఈసీకి సూచించారు. ఈసీ ప్రస్తావిస్తున్న తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రాటిక్), తెలంగాణ రాజ్య సమితి అనేవి వేర్వేరు ఉచ్చారణ, వేర్వేరు నాయకత్వం కలిగిన పార్టీలని.. వాటితో తమ తెలంగాణ రక్షణ సేనకు ఎలాంటి పోలిక లేదని స్పష్టం చేశారు.

**దేశంలో ఒకే పేరుతో వందలాది పార్టీలు లేవా?**
గతంలో కేవలం ఒకే రకమైన భౌగోళిక వర్ణనాత్మక లేదా సిద్ధాంతపరమైన పదాలు ఉన్నాయనే కారణంతో ఏ పార్టీ రిజిస్ట్రేషన్‌నూ నిరాకరించలేదని గుర్తు చేశారు. దేశంలో ఆమ్ ఆద్మీ, అఖండ్ భారత్, మక్కల్, ప్రజా సేవ, జన్ అధికార్, రాష్ట్రీయ జనతా వంటి ఒకే తరహా పదాలతో వందలాది పార్టీలు రిజిస్టర్ అయి ఉన్నాయని, వీటికి సంబంధించిన జాబితాను కూడా లేఖకు జత చేశారు.కేవలం ఊహాజనిత సంక్షిప్త రూపాలు , సాధారణ భౌగోళిక పదాల ఆధారంగా వచ్చిన అభ్యంతరాలన్నింటినీ తిరస్కరించాలని కోరారు.

## ప్రభుత్వ రేటు ఇదే, అమ్మో అన్ని కోట్లా?

ఈ రోడ్డుకు సంబంధించి అవసరమైన 2.77 ఎకరాల భూమికి సీఆర్డీఏ అవార్డు పాస్ చేసింది.. అధికారులు ఈ భూమిని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఉండవల్లిలో సీడ్ యాక్సెస్ రోడ్డుకు సంబంధించి భూమిని స్వాధీనం చేసుకునే సమయంలో.. భూమి యజమానులు అడ్డుకున్నారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేయగా ఉద్రిక్త వాతావరణం కనిపించింది. ఓ మహిళ మహిళా ఎస్సైపై చేయిచేసుకున్నా పోలీసులు మాత్రం సంయమనం పాటించారు. ఓ మహిళకు సంబంధించిన భూమిలో ఉన్న రేకుల షెడ్డును తొలగిస్తుండగా.. కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. వెంటనే పోలీసులు వారిని పక్కకు తీసుకెళ్లారు. ఎట్టకేలకు భూమిని స్వాధీనం చేసుకుని కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో.. ఆ భూమిని చదును చేసే పనులు చేపట్టారు. దాదాపు నాలుగు గంటల పాటూ ఈ భూమి స్వాధీనం ప్రక్రియ కొనసాగింది. అలాగే ఇప్పటికే ప్రకటనలు ఇచ్చిన గ్రామాల్లో కూడా అవార్డు నోటీసులిచ్చి అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఉండవల్లిలో సీడ్‌యాక్సెస్ రోడ్డుకు సంబంధించిన భూమి అంశం ఎప్పటి నుంచో పెండింగ్ ఉంది. పదిమంది రైతులు ఈ భూమిని భూసమీకరణ కింద ఇవ్వలేదు.. దీంతో అధికారులు మొత్తం 2.77 ఎకరాలను భూసేకరణ ద్వారా తీసుకున్నారు. ఈ మేరకు ఈ భూమికి సంబంధించి రూ.7.14 కోట్ల సొమ్మును తీసుకోవడానికి రైతులు నిరాకరించారు. దీంతో అధికారులు ఆర్అండ్ఆర్ కోర్టులో ఈ డబ్బుల్ని జమ చేసి.. భూమిని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఉండవల్లిలో ఎకరాకు రూ.2.40 కోట్ల చొప్పున భూసేకరణ నిబంధనల ప్రకారం పరిహారం జమ చేశామని తెలిపారు. దీన్ని బట్టి అమరావతిలో ఎకరా రూ.2.40 కోట్లు ఉందనే చర్చ జరుగుతోంది.

## లేబర్ క్యాంపులో గంజాయి విక్రయాలు

జయభేరి, సంగారెడ్డి :

కొల్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మై హోమ్ సయుక్ నిర్మాణ సంస్థ లేబర్ క్యాంపు లో కార్మికులకు గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు పెడ్లర్లను పోలీసులు అరెస్ట్ చేసారు. బీహార్ రాష్ట్రం నుండి గంజాయిని తీసుకవచ్చి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగ 5.5 కిలోల గంజాయి స్వాదీనం చేసుకున్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన నిందితుల్లో ప్రధాన నిందితుడు అస్సదుల్లా పరారులో ఉండగా మిగతా నలుగురు ఎండి కైఫ్, ఎండి సైఫ్, ఎండి తుఫెల్, ఎండి ఖలీమ్ లపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# 'గోరక్షకులకు' జైలు శిక్ష

**ముస్లిం మహిళా న్యాయమూర్తికి చంపుతామంటూ బెదిరింపులు**



ఓ వ్యక్తిపై మూకదాడి చేసి, అతని చావుకు కారణమైన 14మందికి జీవిత ఖైదు విధించినందుకు ఓ భారతీయ న్యాయమూర్తి ఆన్‌లైన్‌లో దూషణలకు, చంపుతామనే బెదిరింపులకు లక్ష్యంగా మారారు. దాడిచేసినవారిని హత్య, హత్యాయత్నం,అల్లర్లు, అక్రమనిర్బంధం తదితర నేరాల కింద మధ్యప్రదేశ్‌లోని ఓ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి తబస్సుమ్ ఖాన్ జూన్ 12న దోషులుగా తేల్చారు.
ఈ నేరం 2022లో జరిగింది. 50 ఏళ్ల నజీర్ అహ్మద్ పశువులను రవాణా చేస్తుండగా, తమను తాము 'గోరక్షకులుగా' ప్రకటించుకున్న కొంతమంది కర్రలు, రాడ్లతో అడ్డగించారు. గోవులను హిందువులు పవిత్రంగా భావిస్తారు. చాలా రాష్ట్రాలలో వీటిని చంపడం అక్రమం. గోవులను అక్రమరవాణా చేస్తున్నారనే అనుమానంతో ఈ గుంపు అహ్మద్‌ను, అతనితోపాటు ఉన్న మరో ఇద్దరిని వాహనం నుంచి బయటకు లాగి దారుణంగా దాడి చేశారు. అనంతరం అహ్మద్ గాయాలకు చికిత్స పొందుతూ చనిపోగా, మిగిలిన ఇద్దరు ప్రాణాలతో బయటపడి ఏం జరిగిందో కోర్టుకు వివరించారు.
ఈ కేసు మూక దాడికి స్పష్టమైన ఉదాహరణ అని న్యాయమూర్తి చెప్పారు. కానీ, ఈ తీర్పుతో ఆమె మతపరమైన విద్వేష ప్రచారానికి లక్ష్యంగా మారారు. తీర్పు వెలువడిన కొన్నిరోజుల తరువాత ఖాన్ ఓ ముస్లిం అంటూ బెదిరింపులకు దిగిన వీడియోలు ఆన్‌లైన్‌లోకనిపించాయి. నిందితులు హిందువులు కావడంవల్లే ఖాన్ వారికి వ్యతిరేకంగా వ్యవహరించారని ఆ వీడియోల్లో ఉంది. తరచూ కోర్టు తీర్పులపై విమర్శలు వ్యక్తమవుతుంటాయి. కానీ ఖాన్‌పై చేస్తున్న విమర్శలు ఆమె తీర్పు వెనకున్న చట్టపరమైన కారణాలను కాకుండా మతంపై దృష్టి సారించాయి. ఆమెపై వస్తున్న దూషణల స్థాయి,న్యాయవర్గాలు ఆమెకు మద్దతుగా నిలిచేలా దారితీసింది. ఆమెకు పోలీసు రక్షణ కల్పించారు.
తీర్పు వెలువడిన తరువాత, శిక్షపడిన నిందితుల కుటుంబసభ్యులు కోర్టు వెలుపల తీర్పుకు వ్యతిరేకంగా నిరసనకు దిగినట్టు, నిందితులను జైలుకు తరలించకుండా పోలీసు కాన్వాయ్‌ను అడ్డుకున్నట్టు వార్తలు వచ్చాయి. ''ఆవులను రక్షించినందుకు'' వారిని శిక్షించారని ఆరోపించారు.

**మతపరమైన దూషణలతో వీడియోలు**
ఆ తర్వాత ఖాన్‌పై ఆన్‌లైన్‌లో దూషణల ప్రచారం మొదలైంది. హిందూత్వ భావజాలానికి చెందిన పలువురు ఇన్‌ఫ్లుయెన్సర్లు ఖాన్‌ను మతపరమైన దూషణలతో అవమానిస్తూ, ఆమెపై అత్యాచారం చేస్తామని, చంపేస్తామని బెదిరిస్తున్న వీడియోలు ఆన్‌లైన్‌లో వెలుగులోకి వచ్చాయి. ఒక వీడియోలో ఓ వ్యక్తి, దోషులుగా తేలిన వారిని 10 రోజుల్లో విడుదల చేయకపోతే దేశవ్యాప్తంగా "రక్తపాతం" జరుగుతుందని హెచ్చరించాడు. ఈ కథనం రాసే సమయానికి కూడా అలాంటి అనేక వీడియోలు ఆన్‌లైన్‌లోనే ఉండి, వేల సంఖ్యలో లైక్‌లు, షేర్లు పొందుతున్నాయి. బెదిరింపులు చేస్తూ, హింసను ప్రేరేపిస్తున్న వారి ముఖాలు, సామాజిక మాధ్యమాల ఖాతాల వివరాలు కూడా ఆ వీడియోల్లో స్పష్టంగా కనిపించాయి. హిందూత్వ భావజాలానికి అనుకూలంగా ఉండే హిందీ వార్తా ఛానల్ సుదర్శన్ న్యూస్‌కు చెందిన ఓ యాంకర్, దోషుల కుటుంబాలకు సంఘీభావం ప్రకటించారు. "ఆవులను కాపాడేందుకు అన్నీ పణంగా పెట్టిన తమ కుటుంబ సభ్యులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని వారు ఎప్పుడూ ఊహించి ఉండరు" అని ఆయన అన్నారు. అలాగే, "గోరక్షకుల కోసం పోరాడాల్సిన సమయం ఇదే" అంటూ ప్రేక్షకులు"గొంతెత్తాలి" అంటూ పిలుపునిచ్చారు. తమను తాము గోరక్షణ సంస్థలుగా చెప్పుకునే అనేక సంస్థలు, హిందూత్వ సంస్థలు కూడా ఈ తీర్పుకు వ్యతిరేకంగా భారీ నిరసనలకు దిగాయి.

**'మతాన్ని బట్టి తీర్పుల అంచనా తగదు'**
జూన్ 22న గౌ రక్షా పరిషత్ (స్థూలంగా చెప్పాలంటే 'గోవులను రక్షించే వారి మండలి') పంజాబ్‌లో నిర్వహించిన నిరసనలో ఆందోళనకారులు ఖాన్ దిష్టిబొమ్మను దాడి చేసి దహనం చేశారు. మూడు రోజుల తరువాత ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రీయ బజరంగ్ దళ్ నిర్వహించిన నిరసనలో "గోరక్షకులను" విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మార్కండేయ కట్జూ ఎక్స్‌లో చేసిన పోస్టులో, ఈ వీడియోలు, నిరసనలు కేవలం తీర్పును విమర్శించడం మాత్రమే కాకుండా, "న్యాయాధికారిగా ఖాన్ అధికారాన్ని ఆమె మతపరమైన గుర్తింపునకు పరిమితం చేసి చెల్లనిదిగా చూపించే ప్రయత్నం చేస్తున్నాయి" అని పేర్కొన్నారు.
"ఆమె ముస్లిం అనే గుర్తింపే తీర్పు చెల్లుబాటును ప్రశ్నించడానికి ప్రధాన ఆధారంగా మారింది. ఇది న్యాయసూత్రాలను తలకిందులు చేసినట్లే. న్యాయమూర్తి ఇచ్చిన తీర్పులను చట్టపరమైన తర్కం ఆధారంగా అంచనా వేయాలి గానీ, ఆ తీర్పు చెప్పిన వ్యక్తి మతాన్ని బట్టి కాదు" అని ఆయన రాశారు.
ఆ తర్వాత కట్జూ మాట్లాడుతూ, తనకు ఖాన్ నుంచి సందేశం వచ్చిందని చెప్పారు. తనకు మద్దతు తెలిపినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారని, తనపై జరుగుతున్న దూషణలు తీవ్ర మానసిక వేదనకు గురిచేశాయని, తీర్పు ఇచ్చినందుకు తాను ఏదో నేరం చేసినట్టుగా అనిపించిందని ఆమె చెప్పినట్లు వెల్లడించారు. ఖాన్‌కు ప్రముఖ న్యాయవాదుల సంస్థల మద్దతు కూడా లభించింది. సుప్రీంకోర్టు అడ్వకేట్స్‌ఆన్‌రికార్డ్ అసోసియేషన్ (ఎస్‌సీఏఓఆర్‌ఏ), సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) ఆమెపై వచ్చిన బెదిరింపులను ఖండిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.
ఎస్‌సీబీఏ అధ్యక్షుడు వికాస్ సింగ్ బీబీసీతో మాట్లాడుతూ, న్యాయమూర్తిని బెదిరించడం అత్యంత తీవ్రమైన విషయమని, ఎందుకంటే న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యపు మూల సూత్రాలతో ముడిపడి ఉందని చెప్పారు. "ఇలాంటివి జరగడానికి అవకాశం ఇస్తే, ఏ న్యాయమూర్తి కూడా న్యాయం చేయలేరు. ప్రజాస్వామ్యంలో న్యాయమూర్తులు తమ విధిని భయం ,పక్షపాతం లేకుండా నిర్వర్తించగలగాలి" అన్నారు.
ఇదిలా ఉండగా, పోలీసు అధికారి సుధాకర్ బరాస్కర్ బీబీసీతో మాట్లాడుతూ, భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. రెచ్చగొట్టే వీడియోలను పంచుతున్న వారి కోసం సైబర్ సెల్ గాలిస్తోందని, ఇలాంటి మరిన్ని పోస్టుల కోసం సామాజిక మాధ్యమాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

**'ఖాన్ భద్రతకు మరిన్ని చర్యలు తీసుకోవాలి'**
అయితే, సుప్రీంకోర్టు న్యాయవాది సంజయ్ హెగ్డే మాత్రం ఖాన్ భద్రతను నిర్ధరించేందుకు ప్రభుత్వం, న్యాయవ్యవస్థ మరింత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వాదించారు. న్యాయ సంబంధిత వార్తల వెబ్‌సైట్ లైవ్ లాలో ప్రచురించిన వ్యాసంలో, మాజీ న్యాయమూర్తికి వచ్చిన బెదిరింపుల కేసును ఇటీవల ఎలా పరిష్కరించారో ఉదాహరణగా హెగ్డే ప్రస్తావించారు.
బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి గౌతమ్ పటేల్, ముస్లిం సమాజంలోని వారసత్వ వివాదానికి సంబంధించిన 2024 తీర్పు అనంతరం, ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా 10 నెలలకుపైగా బెదిరింపులను ఎదుర్కొన్నారు.
అయితే ఓ మూడు న్యాయ సంస్థలు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని విచారించిన బాంబే హైకోర్టు, పటేల్‌కు రక్షణ కల్పించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే దర్యాప్తును ముంబయి పోలీసు కమిషనర్ పర్యవేక్షించాలని, కేసు పురోగతిపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది. "హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తికి ప్రభుత్వ రక్షణ, ఆయన కేసుపై న్యాయపరమైన పర్యవేక్షణ అవసరమైతే, జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్న ఓ సెషన్స్ జడ్జికి కూడా అదే వర్తిస్తుంది. ఈ సూత్రం హోదాను బట్టి మారకూడదు. మతాన్ని బట్టి మారకూడదు. ఒక నిర్దిష్ట తీర్పు చుట్టూ నెలకొన్న రాజకీయ వాతావరణాన్ని బట్టి మారకూడదు" అని హెగ్డే రాశారు. గతవారం మధ్యప్రదేశ్ హైకోర్టు, ఖాన్‌కు రక్షణ కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో, ఆమెను బెదిరించిన వారి గుర్తింపుపై ఏం పురోగతి సాధించారో వివరించాలని సీనియర్ అధికారులను ఆదేశించింది. ఆమెకు పోలీసు రక్షణను కొనసాగించాలని కూడా ఆదేశించింది.

## నరరూప రాక్షసుడి కోసం 12 బృందాలు

**షాబాద్ 6 హత్యల కేసులో కొనసాగుతున్న వేట**

జయభేరి, షాబాద్ :



అరగంట వ్యవధిలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ నరమేధానికి సంబంధించి పోలీసులు దర్యాప్తును అత్యంత వేగవంతం చేశారు. ఈ ఘోర కలియుగ వింతకు ఒడిగట్టి ప్రస్తుతం పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. నిందితుడు చాలా ప్రమాదకరమైన వ్యక్తి కావడంతో అతడిని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా పట్టుకోవాలని పోలీసులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈ కేసును పోలీసులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడానికి రంగంలోకి దిగిన ప్రత్యేక గాలింపు బృందాల సంఖ్యను అధికారులు 10 నుంచి 12కు పెంచారు. రాజ్‌కుమార్ కదలికలను క్షుణ్ణంగా గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని భారీగా వినియోగిస్తున్నారు. నిందితుడు ప్రస్తుతం వాడుతున్న, లేదా గతంలో ఉపయోగించిన వివిధ సిమ్ కార్డుల డేటాను సాంకేతిక నిపుణుల సాయంతో నిశితంగా విశ్లేషిస్తున్నారు. అంతేకాకుండా, నగరంలోని మరియు శివారు ప్రాంతాలలోని ప్రధాన బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను అధికారులు నిరంతరం పరిశీలిస్తున్నారు.
ఈ దారుణ ఉదంతం వెనుక ఉన్న అసలు కారణాలను పోలీసులు వెల్లడించారు. నిందితుడు రాజ్‌కుమార్‌పై గతంలో ఒక బాలిక విషయంలో పోక్సో (POCSO) చట్టం కింద కేసు నమోదైంది. తనపై కేసు పెట్టారనే కక్షతో రగిలిపోయిన రాజ్‌కుమార్, సదరు బాలిక కుటుంబాన్ని అంతమొందించాలని పక్కా ప్లాన్ వేశాడు. ఈ క్రమంలోనే మొదటగా ఆ బాలిక తల్లిని, నానమ్మను టార్గెట్ చేసి, వారిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి కడతేర్చాడు. అంతటితో అతని కసి తీరకపోవడంతో, ఆ బాలికను బలవంతంగా ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, అక్కడ అత్యంత కర్కశంగా ఆమె గొంతుకోసి చంపేశాడు. ఆ తర్వాత అక్కడి నుండి నేరుగా తన స్వగృహానికి చేరుకున్న నిందితుడు, అక్కడ ఉన్న తన భార్యపై దాడి చేసి చంపేశాడు. ఆపై ఏ పాపం తెలియకుండా గాఢ నిద్రలో ఉన్న తన కన్న బిడ్డల గొంతులు కూడా కోసి హతమార్చాడు. కేవలం అర గంట వ్యవధిలోనే ముగ్గురు మహిళలు, ఒక బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారులతో కలిపి మొత్తం ఆరుగురిని కిరాతకంగా బలితీసుకున్నాడు. ఈ మారణహోమం గంటల వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా దావానలంలా వ్యాపించి తీవ్ర సంచలనం సృష్టించింది.

**సరిహద్దుల్లో హై అలర్ట్.. జాతీయ రహదారులపై తనిఖీలు**
నిందితుడు తెలంగాణ దాటి పొరుగు రాష్ట్రాలకు పారిపోయే అవకాశం ఉందనే గట్టి అనుమానంతో పోలీసులు అంతరాష్ట్ర సరిహద్దుల్లో హై అలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా కర్ణాటక మరియు ఇతర పొరుగు ప్రాంతాలకు వెళ్లే ప్రధాన హైవేలపై ప్రత్యేక నిఘా బృందాలను మోహరించారు. 44వ నంబర్ జాతీయ రహదారి (NH44) వెంబడి ఉన్న అన్ని రోడ్‌సైడ్ దాబాలు, హోటళ్లు, లాడ్జీలు, అనుమానాస్పద స్థావరాలలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిందితుడి ఫోటోలను అన్ని పోలీస్ స్టేషన్లకు, సరిహద్దు చెక్‌పోస్టులకు చేరవేశారు.

**రూ. 2 లక్షల నగదు బహుమతి ప్రకటన.. ఎస్సైపై వేటు**
పరారీలో ఉన్న కిరాతకుడు రాజ్‌కుమార్ ఆచూకీ తెలిపిన వారికి లేదా అతడిని పట్టుకోవడానికి పోలీసులకు సహకరించిన వారికి రూ. 2 లక్షల నగదు బహుమతి అందజేస్తామని పోలీసులు అధికారికంగా ప్రకటించారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత రహస్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. కాగా, ఇంత పెద్ద ఘోరం జరుగుతున్నా ముందస్తుగా నిరోధించలేకపోయారని, విధుల్లో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై షాబాద్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) రమేశ్‌ను పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే సస్పెండ్ చేస్తూ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు ఎవరైనా నిందితుడిని గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



## గుడిసెలు లేని తెలంగాణ దిశగా మరో అడుగు

- **ములుగులో వేలాది ఇందిరమ్మ ఇళ్లు..!**

జయభేరి, ములుగు :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. మరోవైపు దశాబ్దాలుగా పేద కుటుంబాల జీవితాల్లో కలగానే మిగిలిపోయిన సొంతింటి కల ను నిజం చేస్తూ ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక ముందడుగు వేసింది. ఎన్నో ఏళ్లుగా గుడిసెల్లో, అద్దె ఇళ్లలో, వర్షానికి తడుస్తూ... చలికి వణుకుతూ... కనీస భద్రత లేకుండా జీవనం గడిపిన పేద కుటుంబాలకు ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్లు పథకం కొత్త జీవితానికి నాంది పలుకుతోంది. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఐదు లక్షల రూపాయల గృహనిర్మాణ వ్యయాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తూ, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ప్రభావానికి నిలువెత్తు నిదర్శనం ములుగు జిల్లా....స్థానిక మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోనే అత్యధిక ఏజెన్సీ ప్రాంతంగా గుర్తింపు పొందిన ములుగు జిల్లాకు ఐదు వేలకుపైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం గిరిజన గుడాల్లో ఆనందోత్సవాలు వెల్లివిరిసాయి. వీటిలో ఇప్పటికే 1,315 మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు పూర్తి చేసి కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. మంత్రి ప్రత్యేక చొరవ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనం. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం “గుడిసెలు లేని తెలంగాణ” లక్ష్యంగా ప్రతి అర్హత కలిగిన కుటుంబాన్ని గుర్తిస్తూ నిరంతర ప్రక్రియగా ఇళ్ల మంజూరు కొనసాగుతోంది. ఈ విజయానికి మరో ప్రత్యేక కోణం రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క చూపుతున్న ప్రత్యేక చొరవ. తన సొంత నియోజకవర్గమైన ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన కుటుంబాలకు శాశ్వత నివాస భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. దానికి ఉత్తమ ఉదాహరణ రాఘవపట్నం-ఇప్పలగడ్డ ప్రాంతం. ఈ ఏజెన్సీ గ్రామపంచాయతీని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి 90 మంది గిరిజన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడమే కాకుండా, అక్కడ నిర్మితమవుతున్న ఇందిరమ్మ ఇండ్ల సముదాయానికి లబ్ధిదారులే స్వచ్ఛందంగా “సీతక్క కాలనీ” అని పేరు పెట్టుకోవడం ప్రజా ప్రభుత్వంపై, మంత్రి సీతక్కపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శనం. కొండాయి గ్రామం పేరు వినగానే జంపన్న వాగు వరదల కారణంగా గతంలో ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలు గుర్తుకొస్తాయి. అలాంటి ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే కుటుంబాలకు శాశ్వత భద్రత కల్పించాలనే ఉద్దేశంతో సురక్షిత ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి కొత్త జీవితం అందించిన ఘనత కూడా ప్రజా ప్రభుత్వానికే దక్కుతుంది.

# భక్తజన సంద్రమైన యాదగిరి క్షేత్రం

- శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి నిత్యరాబడి రూ.68.22 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 12 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం భక్తజన సందోహమైంది. ఆదివారం,వేసవి సెలవులు ముగుస్తుండడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అశేషంగా.తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట కిటకిటలాడింది. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కొండ పైన,కొండ కింద పలు ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తుల రద్దీ కనిపించింది. స్వామి వారి దర్శన క్యూలైన్లు,ప్రసాద విక్రయ కేంద్రాలు,గదుల విచారణ కార్యాలయం,టికెట్ల విక్రయ కేంద్రాలు,పార్కింగ్,బస్టాండ్, పుష్కరిణి,తలనీలాలు సమర్పించే కేంద్రం, శ్రీసత్యనారాయణ వ్రత మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు సందడి చేశారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి 5 గంటలకు, సర్వ దర్శనానికి 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.





**కొనసాగుతున్న నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలతో పాటు పలు సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**యాదగిరీశుడి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి ఆదివారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది. నిత్యరాబడిలో భాగంగా స్వామి,అమ్మవార్లకు రూ.68,22,052 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,63,650, బ్రేక్ దర్శనం ద్వారా రూ.8,40,600, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.2,69,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.15,23,100, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.8,47,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,66,012, ప్రసాద విక్రయం ద్వారా రూ.21,00,810, కల్యాణకట్ట ద్వారా రూ.1,70,000తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

# భక్తులకు అన్ని సౌకర్యాలు

- యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధికి పాలకమండలి పనిచేస్తోంది
- యాదగిరిగుట్ట ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ ఎం. సత్యనారాయణరెడ్డి

**జయభేరి, యాదగిరిగుట్ట:**



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధిలో భక్తులకు తిరుమల దేవస్థానం తరహాలో అన్ని సౌకర్యాలను కల్పించే లక్ష్యంగా నూతన పాలకమండలి పని చేస్తామని యాదగిరిగుట్ట ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం అనంతరం రాష్ట్రపతి భవన్‌లో తొలిసారిగా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నూతన పాలకమండలి సభ్యులతో కలిసి చైర్మన్ మాట్లాడుతూ మొదటి సమావేశంలో ఆలయ అభివృద్ధి, సమస్యలపై సభ్యులందరం కూలంకషంగా సమీక్షించడం జరిగిందని, ఆధ్యాత్మికంగా ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలను ఏర్పాటు చేయడం కోసం, సులబమైన దర్శనాలను కల్పించి క్షేత్రానికి భక్తుల రద్దీ పెంచే విధంగా సమావేశం కొనసాగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు అభివృద్ధి పనులు కొండపైన పార్కింగ్, వీఐపీ, వీవీఐ, సాధారణ భక్తులకు వసతి గృహాలకు శంకుస్థాపన చేయడం జరిగిందని, ఆ పనులను కూడా పూర్తి చేయడానికి ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. విలేఖరులు అడిగి ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ స్వామి వారి సన్నిధిలో మండల దీక్ష,భక్తులకు రాత్రి పూట బస, భక్తుల కోసం కొండపైన పుష్కరిణి ఏర్పాటు, రవాణా సౌకర్యం పెంచుట,ప్రధాన రహదారులలో సూచిక బోర్డులతో పాటు పలు అభివృద్ధి పనులను రానున్న రోజుల్లో నిర్ణయాలు తీసుకొని చేపడతామని తెలిపారు. టెంపుల్ సిటీ నిర్మాణంలో కూడా పూర్తిస్థాయిలో సమీక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిలో ఏర్పాటైన వైటీడీఏకు, ఆలయ ట్రస్ట్‌కు ఎలాంటి సంబంధముండదని, రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో ఆలయ అభివృద్ధికి ట్రస్ట్ బోర్డు పనిచేస్తుందని ఆయన తెలిపారు. యాదగిరిగుట్ట ఆలయానికి సంబంధించిన ప్రతీ సమస్యపై ట్రస్ట్ బోర్డు నిర్ణయం తీసుకుంటుందని, బోర్డు నిర్ణయం తీసుకోలేని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉన్న సౌకర్యాలను,యాదాద్రి ఆలయంలో ఉన్న సౌకర్యాలను పరిశీలించి పూర్తి స్థాయిలో ఇక్కడ పనులు పూర్తిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ డైరెక్టర్ హనుమంతరావు, నూతన పాలకమండలి సభ్యులు గుండా మల్లేష్, వినోద్ వెంకటస్వామి, ఎం.రాఘవేందర్‌రావు, లక్ష్మీనారాయణ, ఆలయ ఈవో భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## వంగపల్లి గ్రామంలో పాఠశాల భవనాలకు

- తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య శంకుస్థాపన హర్షం వ్యక్తం చేసిన ఆలేరు నియోజకవర్గం టిడిపి పార్టీ ఇంచార్జి రేగు బాల నర్సయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 12:**

యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం... గతంలో ఇచ్చిన మాట ప్రకారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేయటం అభినందనీయమని ఆలేరు నియోజకవర్గం టిడిపి పార్టీ ఇంచార్జి రేగు బాల నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. 2015 2016 విద్యా సంవత్సరం నుండి ఎన్నో పర్యాయాలు ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్, డీఈవో, ఆర్విఎంపిఓ, జడ్పీ చైర్మన్, అదే విధంగా ప్రభుత్వ అధికారులు, నాయకుల చుట్టూ తిరిగి ఎన్నో పోరాటాలు చేసినప్పటికీ పాఠశాలకు నూతన భవనాల నిర్మాణం జరగలేదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తమ చేతుల మీదుగా ఆదివారం శంకుస్థాపన చేయడం విద్యార్థి లోకానికి వారి తల్లిదండ్రులకు ఆనందదాయకంగా నిలుస్తోందని అన్నారు. గతంలో పార్లమెంట్ సభ్యులుగా ఉన్నప్పుడు 2019సంవత్సరంలో రెండు తరగతి గదులు ఇస్తున్నానని చెప్పి శంకుస్థాపన చేసి వెళ్లడం జరిగింది. నిధులు మంజూరు చేయలేక పోయారని.. ప్రస్తుతం ఆ విధంగా కాకుండా ప్రొసీడింగ్ ఇచ్చిన తర్వాత శంకుస్థాపన చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



## ఆరుద్ర మల్టి స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం

- BRS - పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్

**జయభేరి, దేవరకొండ :**

హైదరాబాద్ B N రెడ్డి నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరుద్ర హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనీ శుభాకాంక్షలు తెలియజేసిన BRS పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ అనంతరం హాస్పిటల్ యాజమాన్యం వారిని శాలువాతో సత్కరించారు.

# బస్వాపురం, గంధమల్ల ప్రాజెక్టులను త్వరలో పూర్తి

- బీర్ల అయిలయ్యను మంత్రిగా చూడాలని ఉంది
- వంగపల్లి సభలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**జయభేరి, యాదగిరిగుట్ట :**



తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి భారత దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో ఆదివారం హ్యామ్ పథకం కింద రూ.358 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అంతకు ముందు రాయగిరి నుండి వంగపల్లి గ్రామం వరకు దాదాపు వెయ్యి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీర్ల అయిలయ్య ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆలేరును అభివృద్ధి చేస్తున్నారని, ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ఆలేరు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాలకు రహదారి సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని, ప్రజలకు ప్రయాణం మరింత సులభంగా మారుతుందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని, ఆలేరును అన్ని విధాలా అభివృద్ధికి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆలేరు ప్రజలకు బీర్ల అయిలయ్య ఆశాజ్యోతిగా ఉన్నాడని,నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. బీర్ల అయిలయ్య మరో ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలవాలని, బీర్ల అయిలయ్యను మంత్రిగా చూడాలని ఉందని తెలిపారు. బస్వాపురం,గంధమల్లను పట్టించుకోకుండా ఆలేరు ప్రజలను మోసం చేసిన కేసీఆర్‌కు ప్రజలు మంచి బుద్ధి చెప్పారని,ఇక ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని అన్నారు. గంధమల్ల, బస్వాపురం ప్రాజెక్టును త్వరలో పూర్తి చేసి ఆలేరు,భువనగిరి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. అనంతరం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య,ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కడియం శ్రీహరి,యశస్విని రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్య రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## పాఠశాల ప్రారంభోత్సవంలో మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, జులై 12 :**

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి.ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ ...షాద్‌నగర్ పట్టణంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. ఆధునిక సౌకర్యాలతో, విద్యార్థుల సమగ్ర వికాసాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మించిన ఈ నూతన భవనం విద్యా రంగంలో మరో ముందడుగుగా నిలుస్తుందని ఆకాంక్షిస్తున్నాను. నాణ్యమైన విద్యతో పాటు విలువలతో కూడిన బోధన అందిస్తూ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దుతున్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను, సిబ్బందికి అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో ముందుకు సాగి సమాజానికి ఆదర్శప్రాయమైన పౌరులుగా ఎదగాలని అన్నారు. ఈ నూతన భవనం విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి ప్రతిభ వికాసానికి మరింత దోహదపడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, పాఠశాల మరిన్ని విజయాలను సాధించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మ్ ఏ సత్తార్, ప్రిన్సిపల్ రఫత్ సుల్తానా, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన సోదా రామకృష్ణ



**జయభేరి, పరకాల, జులై 11:**

పరకాల మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ గూడెల్లి సదన్ కుమార్ తల్లి కీ.,శే.,వీరమ్మ ప్రథమ సంవత్సరీకం కార్యక్రమంలో, 18వ వార్డు చెందిన కీ.,శే.,సాంబరాజు అబ్బయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా వీరి కుటుంబాలను పరామర్శించిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ. ఈ కార్యక్రమంలో రామకృష్ణ తో పాటుగా ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ పరచ, కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, మంద నాగరాజ్,ఏకు రాజు, మాజీ సర్పంచ్ అల్లం రఘునారాయణ, నాయకులు బొచ్చు జెమిని, రిపోర్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## గీతకార్మికుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, పరకాల, జులై 12:**

పరకాల మండలం కామారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు పెరుమాండ్ల రాజకుమార్ ఇటీవల తాటిచెట్టు పైనుండి ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రాజకుమార్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన చల్లా ధర్మారెడ్డి, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రాజకుమార్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం, సంక్షేమ పథకాల ద్వారా పూర్తి స్థాయిలో ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు న్యాయం చేయాలి



**జయభేరి, మేడ్చల్ :**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కే.కే. కమిటీని ఏర్పాటు చేయడాన్ని మేడ్చల్ ఉమ్మడి మండలానికి చెందిన ఉద్యమకారులు స్వాగతించారు. కమిటీ సిఫార్సులు అందిన వెంటనే ప్రభుత్వం జ్యూడిషియల్ కమిటీని ఏర్పాటు చేసి, నిర్ణీత గడువులో ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వయోపరిమితి దాటిన ఉద్యమకారులకు రుణాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారు పలు తీర్మానాలు చేశారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని, గుర్తింపు అనంతరం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని కోరారు. అలాగే కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే హెల్త్ కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఉద్యమకారులు, జర్నలిస్టుల కోసం ఆచార్య జయశంకర్ పేరుతో ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

- సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

జయభేరి, యాదగిరిగుట్ట, జులై 12 :




సెప్టెంబర్ 08,9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలో మహాసభల ఆహ్వాన సంఘ సమావేశాన్ని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ అధ్యక్షతన నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లా, మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మహాసభలను ప్రజల మహాసభలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఏఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఈటీ నర్సింహా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగం, విద్యా సమస్యలు, మాదకద్రవ్యాల వ్యాప్తి, కాంట్రాక్టీకరణ-ఔట్‌సోర్సింగ్, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, మహిళల భద్రత, యువత ఉపాధి వంటి ప్రజా సమస్యలపై ఏఐవైఎఫ్ ఉద్యమాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ మహాసభలలో కీలక నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ యువజన సమస్యల పరిష్కారానికి ఏఐవైఎఫ్ వంటి అభ్యుదయ యువజన సంఘాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. యువతలో సామాజిక చైతన్యం, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు మహాసభలు దోహదపడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పేరబోయిన మహేందర్, వెంకటేశ్వర్లు, సత్య ప్రసాద్, యుగంధర్, కొండల్, బాలకృష్ణ, సల్మాన్ బేగ్, ప్రవీణ్,సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, ఎండి ఇమ్రాన్, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, బచ్చన గోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, ఏశాల అశోక్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, నేతలు ఉప్పల శాంతి కుమార్, పేరబోయిన బంగారి, గాదెగాని మాణిక్యం, అన్యమైన వెంకటేష్, పేరబోయిన పెంటయ్య, ఆరె పుష్ప, గోపగాని రాజు, గుండు వెంకటేష్, అనంతుల నరసింహా, సంగి అరవింద్, పేరబోయిన రాజేష్ పాల్గొన్నారు.

**ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల ఆహ్వాన సంఘ కమిటీ ఎన్నిక..**

ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. చీఫ్ ప్యాట్రన్‌గా పల్లా వెంకట్ రెడ్డి,ప్యాట్రన్స్‌గా ఉజ్జిని యాదగిరిరావు, బోలగాని సత్యనారాయణ,చెడే చంద్రయ్య,గోదా శ్రీరాములు, గౌరవధ్యక్షులుగా నెల్లికంటి సత్యం,అధ్యక్షులుగా యానాల దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పేరబోయిన మహేందర్, కోశాధికారిగా కళ్లెం కృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎల్లంకి మహేష్, వెంకటేశ్వర్లు, కొండల్ లతో పాటు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులను ఎన్నుకున్నారు.



## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

జయభేరి, తుర్కపల్లి, జులై 12 :

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని తుర్కపల్లి మండల సర్పంచులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కోరారు. ఆదివారం యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలోని బీర్ల ఐలయ్య నివాసంలో తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి, వేల్పు పల్లి, గుజ్జవానికుంట తండా సర్పంచులు గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని బీర్ల ఐలయ్యను కోరారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించి అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జేరిపోతుల కర్ణాకర్, గుండ సిద్ధులు, దూప్సింగి నాయక్, నాయకులు ఎరుకలి వెంకటేష్ గౌడ్, మల్లేశం, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరెంటు షాక్ తో ఆవు మృతి




జయభేరి, తుర్కపల్లి, జులై 12 :

కరెంటు షాక్ తో ఆవు మృతి చెందిన సంఘటన తుర్కపల్లి మండలం కొండాపురం గ్రామంలో ఆదివారం జరిగింది .గ్రామానికి చెందిన బర్ల స్వామికి చెందిన ఆవు ట్రాన్స్పారం వద్ద మేస్తుండగా కరెంటు షాక్ తగిలి మృతి చెందింది. సుమారు లక్ష రూపాయల విలువ గల ఆవు మరణించిందని ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరారు.

## గడువులోగా 'సర్' పూర్తి చేయాలి

- తాసిల్దార్ రవికుమార్



తుర్కపల్లి, జులై 12 :

సర్ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని తాసిల్దార్ రవికుమార్ అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండలం మాదాపురం ,గోపాలపురం, నాగాయపల్లి గ్రామాల్లో సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సర్ కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

## 5 గ్రామాలలో ముమ్మరంగా 'సర్'



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం లోనున్న 5 గ్రామాలలో ఆదివారం దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశాల మేరకు 184,185,186, 187,188,195, 196, 197 బూత్ లలో ఆ గ్రామాల ఇంచార్జ్ ఏ. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

## కోయిల్ సాగర్ లో 'సర్' ప్రక్రియ



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ లో ఆదివారం 'సర్' ప్రక్రియ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఓటర్ల బిజిటలైజేషన్ వేగవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ శరత్, బి ఎల్ ఓ లక్ష్మి లతోపాటు స్థానిక నాయకుడు కోయిల్ సాగర్ చందు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి

- జులై 14న రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు
- ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్

జయభేరి, దేవరకొండ :




అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రోజున దేవరకొండ ఏబీవీపీ కార్యాలయం లో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 11,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యను ప్రాథమిక హక్కుగా, సామాజిక సమానత్వానికి పునాదిగా భావించాల్సిన ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పక్కనబెట్టి నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని ఆయన అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల పేరుతో ఒత్తిడి తీసుకువస్తున్నాయని, పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు చదువును కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా రంగానికి ఇచ్చిన హామీలు అమలులో కనిపించడం లేదని యలమల గోపీచంద్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారంలో అవసరమైన చొరవ చూపడంలో విఫలమైందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలపై ప్రభుత్వం స్పందించకపోవడం ఆందోళనకరమని అన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు నిధుల కొరత, ఖాళీ అధ్యాపక పోస్టులు, సరైన మౌలిక వసతుల లేమి, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ కనిపించకపోవడం వల్ల ఉన్నత విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని ఎత్తివేయాలనే కుట్ర చేయడం వల్ల వారి చదువులు మధ్యలోనే నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను కేవలం పరిపాలనా అంశాలుగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయ ప్రాధాన్యత అంశాలుగా ప్రభుత్వం పరిగణించాలని సూచించారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఏబీవీపీ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని, ఈ నేపథ్యంలోనే జులై 14న రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యావేత్తలు ఈ బంద్‌కు మద్దతు తెలిపి ప్రభుత్వంపై ప్రజాస్వామ్యబద్ధమైన ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రభుత్వం విద్యార్థుల సహనాన్ని పరీక్షించకుండా వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సమాజంతో కలిసి ఏబీవీపీ మరింత ఉద్ధృత ఉద్యమాలను చేపడుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర జాయింట్ సెక్రెటరీ యనమల హేమసుందర్, సంతోష్, నగర కార్యవర్గ సభ్యులు చింటూ, చరణ్, వినయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి వ్యాఖ్యలు అర్థరహితం

- BRSV రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు

జయభేరి, దేవరకొండ :

నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా అంటూ ప్రతిపక్ష పార్టీల నాయకులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడడం అర్థరహితమని బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విద్యార్థి విభాగం(BRSV) రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు అన్నారు. స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంకా మీ రక్తదాహం తీరలేదా. 60 ఏళ్లు పీడించి తెలంగాణ నెత్తురు తాగారు కదా.. సరిపోలేదా తెలంగాణ రక్తం రుచిమరిగిన తోడేలు కాంగ్రెస్ పార్టీకి ఇంకెంత రక్తం కావాలి. తెలంగాణ పిల్లల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేసి ఎన్ కౌంటర్ల పేరుతో నెత్తుటేళ్లు పారించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. బిఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేయటం మానుకొని ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. బి ఆర్ ఎస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న అధికారంలో ఉన్న నిరంతరం తెలంగాణ ప్రజల కోసం పాటు పడుతుందని అన్నారు.

## ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం

- కొత్త బోరు మోటార్‌ను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

జయభేరి, కుత్బుల్లాపూర్ :

బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలోని 12వ బ్లాక్ నుండి 27వ బ్లాక్ వరకు ఉన్న ఎనిమిది బ్లాక్‌లలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొనడంతో ఆయా బ్లాక్‌ల కాలనీవాసులు గత వారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి సమస్యను వివరించారు.వెంటనే స్పందించిన హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి కొత్త బోరు మోటార్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అధికారుల సహకారంతో బోరు మోటార్ ఏర్పాటు పూర్తికాగా, హన్మంత్ రెడ్డి స్వయంగా దానిని ప్రారంభించి కాలనీవాసులకు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అరికెల విజయ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వీర రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ సాల్మన్ రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతగింది సురేష్, 20వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మన్నె కుమార్, బాలరాజు, శ్రీను, హేమలత, రజియా, కమలమ్మ, డీసీసీ జనరల్ సెక్రటరీ రమ్య, సుధారాణి, సోమరాజు తదితరులు, అలాగే పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యను వెంటనే పరిష్కరించిన కొలన్ హన్మంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# కొలువుదీరిన వెంకటేశ్వరుడు

- అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ
- గోవింద నామస్మరణతో మారుమోగిన అయ్యప్ప ఆలయం..
- స్వామివారిని దర్శించుకున్న వందలాది భక్తులు

జయభేరి, పరకాల, జులై 12:




పరకాల పట్టణంలోని హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ పాలకుర్తి గౌతమ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ, ఆలయ ధర్మకర్త, ప్రముఖ వైద్యులు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తుల 'గోవింద... గోవింద...' నామస్మరణ మధ్య స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం పరకాల పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కిటకిటలాడగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా అయ్యప్ప స్వామిని దర్శించుకొని కోరుకున్న కోరికలు నెరవేరాయని, ఇప్పుడు శ్రీ వెంకటేశ్వర స్వామి కూడా కొలువుదీరడంతో ఆలయ మహిమ మరింత పెరిగిందని, భక్తుల రద్దీ మరింత అధికమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## డీఏపీ పంపిణీలో యాప్ ఒక్కటే పారదర్శకతకు మార్గం

- గందె వెంకన్న, ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు

జయభేరి, పరకాల, జులై 12:



యూరియా పంపిణీని మొబైల్ యాప్ ద్వారా అమలు చేయడంతో బ్లాక్ మార్కెట్, దారిమళ్లింపులకు గణనీయంగా అడ్డుకట్ట పడిందని, ఇదే విధానాన్ని డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల పంపిణీకీ విస్తరించాలని పరకాల మండల ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం, డీఏపీ ఎరువు మొబైల్ యాప్ పరిధిలో లేకపోవడాన్ని కొన్ని ఎరువుల కంపెనీలు అవకాశంగా మలుచుకుని కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయని ఆరోపించారు. డీఏపీ కేటాయింపులతో పాటు ఇతర ఉత్పత్తులను బలవంతంగా కొనుగోలు చేయించే 'లింకింగ్' విధానం వల్ల డీలర్లు, రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. యూరియా తరహాలోనే అన్ని సబ్సిడీ ఎరువులను యాప్ ద్వారా పంపిణీ చేస్తే ప్రభుత్వ సబ్సిడీ నేరుగా అర్హులైన రైతులకు చేరడంతో పాటు, కృత్రిమ కొరత, అధిక ధరలు, బ్లాక్ మార్కెట్ వంటి అక్రమాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం రైతు ప్రయోజనాల కోసం తీసుకునే ప్రతి నిర్ణయానికి తమ సంఘం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేసిన అసోసియేషన్, అక్రమాలకు పాల్పడుతున్న కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది.

## బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా యొక్క క్లైంట్ పట్లోళ్ల వెంకట రమణా రెడ్డి, S/o. పట్లోళ్ల విట్టల్ రెడ్డి, నివాసం ఇంటి నెంబర్ 8-2-293/82/A/1057/1, రోడ్ నెంబర్ 52, బంజారాహిల్స్, హైదరాబాద్ వాస్తవ్యుడు రంగారెడ్డి జిల్లాలోని ఫరూక్ నగర్ మండలం, కంసాన్‌పల్లి గ్రామం, నాగూర్లగడ్డ తాండాకు చెందిన ఆంగోతు గణేష్ S/o. ఆంగోతు బాలు దగ్గర సర్వే నెంబర్లు 164/EAA/A, 170/AA/7/AA, 179/A/2/A, 181/RU/1, 185/U/1, 182/U/2, 182/1, 185/0/1, 185/LU/A, 186/EE, 186/UU, విస్తీర్ణాలు 00-08, 00-0350, 00-08, 00-02, 00-2750, 00-2550, 00-02, 00-18, 00-1250, 00-05, 00-20 మొత్తం విస్తీర్ణం ఎ 3-12 గుంటల పట్టా భూమిని అగ్రిమెంట్ ఆఫ్ సేల్ ద్వారా కొనుగోలు చేయడం జరిగినది. ఈ విషయాన్ని మరుగున పరిచి ఈ ఆంగోతు గణేష్ అనే వ్యక్తి పైన తెలిపిన వ్యవసాయ భూములను ఇతరులకు అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నాడని నా క్లైంటుకు రూఢీగా తెలిసినది. అయితే పైన తెలిపిన భూములపై ఆంగోతు గణేష్ పైన షాద్నగర్ పట్టణంలోని 16వ అదనపు జిల్లా కోర్టులో పైన తెలిపిన భూములపై సివిల్ దావా వేయడం జరిగినది. అట్టి దావా నెంబర్ O.S. No. 220 of 2025, ఇది ఇప్పటికీ పెండింగ్ లో ఉన్నది. కావున పైన తెలిపిన వ్యవసాయ భూములపై ఎలాంటి అమ్మకాలు, కొనగోలు జరిపిన నా క్లైంట్ తీసుకునే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని ఈ పత్రిక ద్వారా నా క్లైంట్ తరఫున బహిరంగంగా తెలియపరచనైనది.

సం/- పాతపల్లి సురేందర్ రెడ్డి, న్యాయవాది
షాద్నగర్. Cell : 9948698778.

# వర్షాల లేమితో రైతాంగం సంక్షోభంలో తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్

**జయభేరి, తుర్కపల్లి, జూలై 12 :**

వర్షాలు లేని తో రైతాంగం సంక్షోభంలో తక్షణ చర్యలు చేపట్టాలని, గంధమల్ల ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బేజాడి కుమార్ అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవక ఇప్పటికే విత్తనాలు వేసిన పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఒకవైపు వర్షాభావం మరోవైపు ఎరువులు, విత్తనాలు ,పురుగుల మందుల ధరలు విపరీతంగా పెరగడంతో సాగు ఖర్చు భారీగా పెరిగిందని అన్నారు. అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్న రైతులకు ఈ పరిస్థితులు మరింత భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని వ్యవసాయ రుణాలను సులభంగా మంజూరు చేయాలని, పంటలకు అవసరమైన విద్యుత్తును నిరంతరంగా



సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచన వేసి రైతులకు తక్షణ నష్ట పరిహారం అందించాలని కోరారు. రైతు పండించిన ప్రతి పంటకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధర కల్పించాలని, కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి మధ్యవర్తుల దోపిడీని అరికట్టాలని అన్నారు. రైతుల కోసం ప్రాజెక్టు అని రైతుల భూములు లాక్కోవడంలో చూపిన శ్రద్ధ ఆ ప్రాజెక్టును పూర్తి చేయడంలో లేదని వెంటనే గంధ మల్ల నిర్మాణం పూర్తి చేసి రైతులకు నీళ్లు ఇస్తే కరువు సమయంలో ఆదుకునే వారవుతారని అన్నారు. పంట బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేలా చూడాలని సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి వెళుతోందని అన్నారు.

రైతు వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని లేకపోతే ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మండల, జిల్లా రాష్ట్రస్థాయిలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి తమ్మిడి అంజయ్య, సుంచు రాములు, ఆర్ ఉదయ్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషి ఫలితం..

- రామంతాపూర్ పెద్దచెరువు పునరుద్ధరణకు మహర్దశ

**జయభేరి, ఉప్పల్ :**

హబ్సిగూడ, రామంతాపూర్ డివిజన్ ప్రజలకు ఎంతో కీలకమైన రామంతాపూర్ పెద్దచెరువు పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టిన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.సుమారు రూ.19 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రతిష్ఠాత్మక అభివృద్ధి కార్యక్రమం ద్వారా రామంతాపూర్ పెద్దచెరువుకు సరికొత్త రూపు రానుండటంతో పాటు, పరిసర ప్రాంతాల పర్యావరణ పరిరక్షణకు, భూగర్భ జలాల పెరుగుదలకు, ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు ఎంతో దోహదపడనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా చెరువుల పరిరక్షణకు తాను ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రామంతాపూర్ పెద్దచెరువు పునరుద్ధరణ పూర్తయితే వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలమట్టాలు మెరుగుపడి, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. చెరువు చుట్టూ అందమైన అభివృద్ధి పనులు, పచ్చదనం, ప్రజలు సేదతీరేందుకు అనువైన సౌకర్యాలు ఏర్పాటు చేయడం ద్వారా ఇది నగర ప్రజలకు ఒక ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన చెరువులను సంరక్షించి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్య, వైద్యం వంటి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రూ.19 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక పునరుద్ధరణ పనులు పూర్తయిన అనంతరం రామంతాపూర్ పెద్దచెరువు నగరంలోనే ఆదర్శవంతమైన చెరువుగా రూపుదిద్దుకుని, పర్యాటకులను ఆకర్షించే ప్రదేశంగా నిలవడంతో పాటు స్థానిక ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించనుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితాలో పొరపాట్లకు తావు ఇవ్వరాదు

- బిజెపి దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి
- కొత్తకోటలో 'సర్' సమావేశం

**జయభేరి, దేవరకద్ర :**

ఓటరు జాబితాలో పొరపాట్లకు తావు ఇవ్వరాదని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోట పట్టణంలో ఆదివారం జరిగిన బూత్ లెవెల్ 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సమావేశంలో పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి తో పాటు దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రశాంత్ రెడ్డి మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడి ఓటు అత్యంత విలువైనదని, ఆ ఓటును పరిరక్షించే బాధ్యత ప్రతి బూత్ లెవెల్



ఏజెంట్ బిఎల్ఏ లపై ఉందన్నారు. 'సర్' ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా,నిబంధనలకు అనుగుణంగా జరిగేలా బూత్ లెవెల్ బి ఎల్ ఓ అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రతి ఓటర్‌కు అవగాహన కల్పించాలని సూచించారు..ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు సక్రమంగా నమోదయ్యేలా కృషి చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని బిఎల్ఏ లకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజవర్ధన్ రెడ్డి, జిల్లా కొ కన్వీనర్ రమేష్, జిల్లా కార్యదర్శి గట్టు మల్లేష్,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దాబా శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భరత్ భూషణ్, కొత్తకోట పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, 'సర్' ఇంచార్జ్ నారాయ ణరెడ్డి, జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, వివిధ మండలాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు,ఆయా మండలాల కమిటీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

# కేవీకే ఫార్మసీ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు

- బి.ఫార్మసీ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ప్రముఖుల ప్రశంస
- ముఖ్యఅతిథిగా హాజరైన కెఈఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి : సతీష్ వి.కడియాల

**జయభేరి, ఎల్బీనగర్:**



విద్యా ప్రమాణాలలో ఉత్తమ నాణ్యతను కనబరిచినందుకు గాను కేవీకే కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రతిష్టాత్మక ఐఎస్ఓ (ISO) సర్టిఫికేషన్‌ను సాధించింది.ఈ సందర్భంగా శనివారం కళాశాలలో బీ.ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కేఈఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి సతీష్ వి.కడియాల ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం కార్యక్రమంలో మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన ఫార్మసీ విద్య,పారదర్శక పరిపాలనకు ఈ ప్రతిష్టాత్మక ఐఎస్ఓ గుర్తింపు నిదర్శనమన్నారు. బి.ఫార్మసీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ తమలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి సమాజ సేవకు ఉపయోగించాలని.. అభ్యసించిన కళాశాల పేరును మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు.అనంతరం కళాశాల ఆడిటర్ హర గోపాల్ మాట్లాడుతూ.. కె.వి.కె కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఐఎస్ఓ గుర్తింపు పొందినందుకు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ఇదే విధమైన నాణ్యమైన అంతర్జాతీయ ప్రమాణాలను కొనసాగించాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు.అధ్యాపకులు అలాగే కళాశాల సిబ్బంది సమిష్టి కృషి వల్లే కె.వి.కె కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కి ఈ ఘనత సాధ్యమైందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా.ఎ.సతీష్ చంద్ర అన్నారు.భవిష్యత్తులో కూడా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యా, పరిశోధనా రంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తామని తెలియజేశారు. నాణ్యతా ప్రమాణాలను అమలు చేయడంలో అధ్యాపకుల పాత్ర కీలకమని ఐక్యూఏసీ,ఎన్‌బీఏ కోఆర్డినేటర్ డా.వై.ఎన్. కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.




# పదవీ విరమణ సన్మాన సభలో మాజీ మంత్రితో ఉప్పల్ ఎమ్మెల్యే

**జయభేరి, ఉప్పల్ :**

కేంద్ర విద్యాలయ నెం.1, ఉప్పల్‌లో ఆర్థిక శాస్త్రం (ఎకనామిక్స్) పీజీటీగా 31 ఏళ్లపాటు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన సల్గుటి చంద్రశేఖర్ రెడ్డి ఆత్మీయ సమ్మేళనం, పదవీ విరమణ సన్మాన సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైందని, మూడు దశాబ్దాలకు పైగా విద్యారంగానికి



విశిష్ట సేవలు అందించిన సల్గుటి చంద్రశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజానికి, విద్యారంగానికి తన అనుభవాన్ని అందిస్తూ మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సల్గుటి చంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించి, శాలువాతో సత్కరించి, వారి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల మేఘమాల విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.






## వధూవరులను ఆశీర్వదించిన కవిత మధుసూదన్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని అడ్డాకల్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు చిన్న నర్సన్న కుమారుడు శేఖర్, సుజాతల వివాహానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## రెడిమిక్స్ ప్లాంట్ ప్రారంభోత్సవం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం శంకరపల్లి తాండ సమీపంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన స్వస్తిక్ రెడీమిక్స్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గం బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు వాస్తు పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన ప్రశాంత్ రెడ్డిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కెపిఆర్ యువసేన నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు అందజేసిన సరోజ్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం లాల్ కోటలోని శివాలయం అభివృద్ధికి హైకోర్టు న్యాయవాది, బీ ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సరోజ్ రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అందులో ఉన్న తృప్తి ఎందులో లభించదన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ దేవాలయాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కురుమూర్తి స్వామివారికి సరోజ్ రెడ్డి పూజలు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని శ్రీ కురుమూర్తి స్వామి వారిని ఆదివారం హైకోర్టు న్యాయవాది, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానానికి వచ్చిన సరోజ్ రెడ్డిని ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరోజ్ రెడ్డి పై పురోహితులు అక్షింతలు చల్లి ఆశీర్వచనం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జక్కిడి శివచరణ్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన బీసీ, యాదవ సంఘాలు



**జయభేరి, ఎల్బీనగర్ :**

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమితులైన 82 ఏళ్ల పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీసీ, యాదవ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఒక వృద్ధ మహిళను అవమానించడం, ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ధిక్కరించడం సరికాదని పేర్కొన్నారు. శివచరణ్ రెడ్డిని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష పదవి, పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బీసీ వర్గాలకు, యాదవ సమాజానికి, శ్రీమతి ఈశ్వరమ్మ యాదవ్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించరు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు బారి అశోక్ యాదవ్, మేడబోయిన ప్రవీణ్, శ్రవణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# 51 ఏళ్ల వయసులో గ్లామర్ అరాచకం..

బాలీవుడ్ ప్రముఖ నటి అమీషా పటేల్ సినిమా ప్రస్థానం అత్యంత ఆసక్తికరమైనదనే చెప్పాలి. 2000 సంవత్సరంలో హృతిక్ రోషన్ సరసన 'కహో నా ప్యార్ హై' చిత్రంతో ఆమె వెండితెరకు పరిచయమయ్యారు. రాకేష్ రోషన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఇండస్ట్రీ హిట్ సాధించడమే కాకుండా, అమీషాను రాత్రికి రాత్రే స్టార్ హీరోయిన్‌ను చేసింది. ఆ తర్వాత టాలీవుడ్‌లో పవన్ కళ్యాణ్ సరసన 'బద్రి' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యారు. అయితే ఆమె కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లిన చిత్రం 'గదర్: ఏక్ ప్రేమ్ కథ' (2001). సన్నీ డియోల్ సరసన 'సకీనా' పాత్రలో ఆమె నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఈ సినిమా భారతీయ చలనచిత్ర చరిత్రలోనే అతిపెద్ద విజయాల్లో ఒకటిగా నిలిచింది. ఆ తర్వాత 'హమ్రాజ్', 'భూల్ భులయ్యా' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించినప్పటికీ, ఆ తర్వాత ఆమె కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదురయ్యాయి. కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోవడం, వ్యక్తిగత కారణాల వల్ల ఆమె కొంతకాలం వెండితెరకు దూరమయ్యారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత, 2023లో వచ్చిన 'గదర్ 2' చిత్రంతో అమీషా పటేల్ గ్రాండ్ కంబ్యాక్ ఇచ్చారు. సన్నీ డియోల్, అమీషా పటేల్ కాంబినేషన్ మళ్లీ మ్యాజిక్ రిపీట్ చేయడంతో ఈ చిత్రం రూ. 500 కోట్లకు పైగా వసూలు చేసి రికార్డు సృష్టించింది. సకీనా పాత్రపై ప్రేక్షకులకు ఉన్న ఆదరణ ఇప్పటికీ తగ్గలేదని ఈ చిత్రం నిరూపించింది. 'గదర్ 2' సాధించిన భారీ విజయంతో, ఈ ఫ్రాంచైజీలో 'గదర్ 3' నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కహో నా ప్యార్ హై'తో మొదలైన ఆమె ప్రయాణం, ఎన్నో ఒడిదొడుకులను దాటుకుని నేడు 'గదర్ 3' వరకు చేరుకోవడం ఆమె సుదీర్ఘ సినీ ప్రస్థానానికి నిదర్శనం. అమీషా పటేల్ జూన్ 9, 1975న ముంబైలో జన్మించారు. ఆమె ప్రముఖ న్యాయవాది మరియు రాజకీయ నాయకుడు రజనీ పటేల్ మనవరాలు. సినిమా నేపథ్యం లేకపోయినప్పటికీ, చదువులో ఆమె ఎంతో ప్రతిభ కనబరిచారు. జూనియర్ ఎన్టీఆర్ సరసన 'నరసింహుడు' (2005) మహేష్ బాబు సరసన 'నాని' (2004) చిత్రంలో ఒక ప్రత్యేక గీతంలో నటించారు.



# 'సారంగ దరియా'కు బాలయ్య చిన్న కుమార్తె స్టెప్పులు

నందమూరి బాలకృష్ణ చిన్న కుమార్తె, విశాఖపట్నం టీడీపీ ఎంపీ శ్రీభరత్ సతీమణి నందమూరి తేజస్విని మరోసారి తన డ్యాన్స్ టాలెంట్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. సినీ ఇండస్ట్రీకి దూరంగా ఉన్నప్పటికీ, అప్పుడప్పుడు తన డ్యాన్స్ వీడియోలతో నెటిజన్లను ఆకట్టుకుంటూ వస్తున్న ఆమె, తాజాగా చేసిన ఓ పెర్ఫార్మెన్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఇటీవల ప్రముఖ కొరియోగ్రాఫర్ భాను మాస్టర్‌తో కలిసి డ్యాన్స్ చేసిన వీడియోతో వార్తల్లో నిలిచిన తేజస్విని, ఇప్పుడు మరోసారి తన స్టెప్పులతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఈసారి నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన 'లవ్ స్టోరీ' సినిమాలోని సూపర్ హిట్ ఫోక్ సాంగ్ సారంగ దరియా కు ఆమె చేసిన డ్యాన్స్ సోషల్ మీడియాలో భారీగా ట్రెండ్ అవుతోంది. ఈ పాటలో సాయి పల్లవి చూపించిన ఎనర్జీ, గ్రేస్, ఎక్స్‌ప్రెషన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. అలాంటి పాటకు డ్యాన్స్ చేయడం అంత ఈజీ కాదు. కానీ తేజస్విని మాత్రం ఏమాత్రం వెనుకాడకుండా, ఒక ప్రొఫెషనల్ డ్యాన్సర్‌ను తలపించేలా స్టెప్పులు వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. పాటకు తగ్గట్టుగా ఆమె చూపించిన హావభావాలు, టైమింగ్, బాడీ లాంగ్వేజ్ వీడియోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డ్యాన్స్‌పై తనకున్న ప్యాషన్‌ను మరోసారి నిరూపించిన తేజస్విని పెర్ఫార్మెన్స్‌కు సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. బాలయ్య కుమార్తె అంటే ఈ స్థాయి ఎనర్జీ ఉండాల్సిందే , తండ్రిలాగే కూతురిలో కూడా అద్భుతమైన గ్రేస్ ఉంది , సాయి పల్లవి స్టెప్పులను ఎంతో కాన్ఫిడెంట్‌గా రీక్రియేట్ చేశారు అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇక నందమూరి అభిమానులు కూడా ఈ వీడియోను భారీగా షేర్ చేస్తూ తేజస్వినిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, ఆమె డ్యాన్స్ స్కిల్స్ మాత్రం ఏ మాత్రం తగ్గలేదని, అవకాశం వస్తే మంచి డ్యాన్సర్‌గా కూడా గుర్తింపు తెచ్చుకునే స్థాయి టాలెంట్ ఉందని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం నందమూరి తేజస్విని 'సారంగ దరియా' డ్యాన్స్ వీడియో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల్లో వైరల్‌గా మారింది. ఆమె ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌ను చూసిన నెటిజన్లు మరోసారి ఫిదా అవుతూ వీడియోను విస్తృతంగా షేర్ చేస్తున్నారు.

# మూడు తరాలు.. నాలుగు పాత్రలు?



పానిండియా స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో 'రాకా' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 800కోట్ల భారీ బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నది. ఈ సినిమాలో తాత, తండ్రి, ఇద్దరు కొడుకులుగా అల్లు అర్జున్ నటిస్తున్నారట. నిజానికి ఇద్దరు కొడుకుల పాత్రలకు మాత్రమే బన్నీని అనుకున్నారట అట్లీ. తాత, తండ్రి పాత్రలను వేరే నటులతో చేయించాలని ఆయన భావించారట. కానీ ఆ పాత్రల తీరుతెన్నులు నచ్చడంతో తానే చేస్తానని బన్నీ పట్టుబట్టారట. బన్నీ కోరిక మేరకు లుక్ టెస్ట్ నిర్వహించి, సంతృప్తికరంగా అనిపించడంతో అట్లీ ఓకే చేశారట. బన్నీ ఈ సినిమాలో నాలుగు పాత్రలు పోషించడం సినిమాకు కూడా ప్లస్ అవుతుందనేది చిత్రబృందం అభిప్రాయం కూడా. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సిఉంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతున్నది. 2027 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నారు. దీపిక పదుకొన్ ఇందులో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

# కల్కి పార్ట్ 2 కోసం వెయిట్ చేయండి..





పాన్ ఇండియా దర్శకుడు నాగ్ అశ్విన్ సాధారణంగా సోషల్ మీడియాలో వివాదాలకు దూరంగా ఉంటారు. అయితే తన బ్లాక్‌బస్టర్ చిత్రం కల్కి 2898 AD పై గత కొద్ది రోజులుగా వస్తున్న విమర్శల నేపథ్యంలో ఆయన తొలిసారి మౌనం వీడి స్పందించారు. ముఖ్యంగా అఖిల్ అక్కినేని నటించిన 'లెనిన్' సినిమా విడుదలైన తర్వాత మొదలైన పోలికలు, కర్ణుడి పాత్రపై వస్తున్న కామెంట్లకు నాగ్ అశ్విన్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. జూలై 10న విడుదలైన అఖిల్ అక్కినేని 'లెనిన్' సినిమా బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో కన్నడ నటుడు ప్రమోద్ పంజు పోషించిన వసంత్ పాత్రకు ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు లభిస్తున్నాయి. ఆయన నటనను కొనియాడుతూ ఓ నెటిజన్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది.

ఆ పోస్ట్‌లో సిల్వర్ స్క్రీన్‌పై కర్ణుడి పాత్రను ఇలా చూపించాలి అని పేర్కొనడంతో, కొందరు నెటిజన్లు 'కల్కి 2898 AD'లో కర్ణుడి పాత్ర చిత్రీకరణపై విమర్శలు చేయడం ప్రారంభించారు. సినిమాలో కర్ణుడిని అతిగా గ్లోరిఫై చేశారని, మహాభారతంలోని అసలు కథకు భిన్నంగా కొన్ని అంశాలను చూపించారని సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. వివాదం రోజురోజుకూ పెరగడంతో, ఇంతకాలం స్పందించని నాగ్ అశ్విన్ ఎట్టకేలకు సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రముఖ ఆర్థికవేత్త, రచయిత వివేక్ దేబ్‌రాయ్ ఆంగ్లంలో అనువదించిన మహాభారతం పుస్తకంలోని ఒక పేజీని షేర్ చేస్తూ విమర్శలకు సమాధానం ఇచ్చారు.

ఆ పోస్ట్‌లో ఆయన, ఇవి ద్రోణ వధ పర్వంలో అర్జునుడితో శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు. దయచేసి మహాభారతం చదవండి. ముఖ్యంగా వివేక్ దేబ్‌రాయ్ అనువాదాన్ని చదవాలని నేను సూచిస్తున్నాను అని పేర్కొన్నారు. అంతేకాదు, శ్రీకృష్ణుడు అర్జునుడి ఎదుట కర్ణుడిని ఎన్నిసార్లు ప్రశంసించాడో ఒకసారి తెలుసుకోండి. మన చరిత్రపై నాకు ఎంతో గౌరవం ఉంది. నేను ఏం చేస్తున్నానో నాకు పూర్తిగా తెలుసు. 'కల్కి పార్ట్ 2' కోసం వేచి ఉండండి అంటూ నాగ్ అశ్విన్ ధీమాగా స్పందించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా "వెయిట్ ఫర్ పార్ట్ 2" అనే ఒక్క మాటతోనే సీక్వెల్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచేశారు.

'కల్కి 2898 AD' మొదటి భాగంలో ప్రభాస్ నటన, విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు, సంతోష్ నారాయణన్ అందించిన నేపథ్య సంగీతం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అయితే కర్ణుడి పాత్రను ఎలా చూపించారనే అంశంపై అప్పటి నుంచే కొంత చర్చ కొనసాగుతోంది. తాజాగా 'లెనిన్' సినిమా తర్వాత ఆ చర్చ మళ్లీ తెరపైకి రావడంతో నాగ్ అశ్విన్ నేరుగా స్పందించారు.నాగ్ అశ్విన్ ఇచ్చిన సమాధానం తర్వాత ఇప్పుడు సోషల్ మీడియాలో అభిమానులు విస్తృతంగా చర్చిస్తున్నారు. రెండో భాగంలో కర్ణుడి పాత్రకు మరింత ప్రాధాన్యం ఉంటుందా? మహాభారతానికి సంబంధించిన మరిన్ని అంశాలను ఎలా చూపించబోతున్నారు? అనే అంశాలపై ఆసక్తి వ్యక్తమవుతోంది.

# హీరోయిన్స్ ను బీట్ చేస్తున్న వయ్యారి భామ..

ఆలేఖ చిట్టి పికిల్స్.. ఆ మధ్య బాగా పాపులర్ అయ్యింది ఈ పేరు. పచ్చళ్ళ వ్యాపారం మొదలు పెట్టిన ముగ్గురు అక్కా చెల్లెళ్ల గురించి తెలియని వారు ఉండరు. సోషల్ మీడియా ద్వారా తమ పికెల్స్ ను పాపులర్ చేసుకున్నారు ఈ ముగ్గురు. అయితే పికిల్స్ రేటు గురించి ఓ నెటిజన్ అడగడం.. తన్ని ఇష్టమొచ్చినట్టు తిట్టడంతో సోషల్ మీడియాలో ఒక్కసారిగా వీరి పై నెటిజన్స్ విరుచుకుపడ్డారు. రమ్య మోక్ష.. ఈ చిన్నది తన అందంతో కుర్రకారును కవ్విస్తుంది. సోషల్ మీడియాలో ఈ బ్యూటీ చేసే రీల్స్ కు మంచి క్రేజ్ ఉంది. ఆమధ్య ఓ సినిమాలో నటించింది రమ్య మోక్ష.. అశ్విన్ బాబు హీరోగా నటిస్తున్న వచ్చినవాడు గౌతమ్ అనే సినిమాలో నటించింది. కానీ ఆ సినిమా ఇంతవరకు ఎక్కడ అడ్రస్ లేదు. ఇదిలా ఉంటే రమ్య తెలుగు రియాలిటీ గేమ్ షో బిగ్ బాస్ లోకి అడుగుపెట్టి అందరిని ఆకట్టుకుంది. వైల్డ్ కాదు ద్వారా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ ఉన్నది కొన్ని రోజులే కానీ బాగానే హడావిడి చేసింది. వెళ్లిన వెంటనే గొడవలు, గోలలు ఇలా రచ్చ చేసి ఆతర్వాత ఎలిమినేట్ అయ్యి బయటకు వచ్చింది. ఇదిలా ఉంటే రమ్య సోషల్ మీడియాలో గ్లామర్ డోస్ పెంచేసింది. ఈ చిన్నది షేర్ చేసే వర్కౌట్ వీడియోలు కుర్రాళ్లను కవ్విస్తున్నాయి. పక్క హీరోయిన్ మెటిరీయల్, ఈ బ్యూటీ హీరోయిన్ అవ్వడం గ్యారెంటీ అంటున్నారు నెటిజన్స్. ఇండస్ట్రీకి హీరోయిన్ దొరికేసిందిరోయ్ అంటున్నారు కుర్రాళ్ళు. ఈ అమ్మడు తన ఫొటోలతో కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తుంది.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**